ఆణిముత్యాల తెలుగు పద్యాల సంకలనం

# వర్ణన రత్నాకరము

పాఠకమిత్ర వ్యాఖ్య – పద్దెనిమిదవ సంపుటం

సంకలనకర్త

**దాసరి లక్ష్మణస్వామి**

వ్యాఖ్యాతలు

**బేతవోలు రామబ్రహ్మం**        **అద్దంకి శ్రీనివాస్**

ప్రచురణ

ప్రాచీన తెలుగు - అధ్యయనకేంద్రం

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

&

**ఎమెస్కో** హైదరాబాద్

# వర్ణన రత్నాకరము

## పాఠకమిత్ర వ్యాఖ్య – పద్దెనిమిదవ సంపుటం

## విషయసూచిక


| | అంశం | పద్యసంఖ్య | పుట | వ్యాఖ్యాత |
|---|---|---|---|---|
| | సంపాదకీయం | | 7–8 | |
| 1. | వేశ్యామాతృధర్మములు, వేశ్యాప్రాముఖ్యము, వేశ్యాగర్హణము. | 1–34 | 9–42 | బేతవోలు రామబ్రహ్మం |
| 2. | స్త్రీ పురుష జాతుల లక్షణాలు, తురగజాతి పురుష లక్షణాలు, శశజాతి పురుష లక్షణాలు | 35–48 | 43–61 | బేతవోలు రామబ్రహ్మం |
| 3. | కళలు – కళాస్థానములు, విరక్తాది స్త్రీ లక్షణములు, ఋతుమతి, వశ్యౌషధములు, నఖక్షత దంతక్షత చుంబనాదులు, ఆలింగనములు | 49–82 | 62–91 | ॥ |
| 4. | బంధన నామములు, పురుషుల బూటకపు శపథాలు, బహుపత్నీకుడు, గర్భాధాన పద్ధతి, తొలిరేయి ముచ్చట్లు, గర్భోత్పత్తి క్రమము, పరస్త్రీ గమననింద | 83–163 | 92–149 | ॥ |
| 5. | భార్యాభర్తల ధర్మములు, భార్యావియోగము, ముసలి మగఁడు – పడుచుపెండ్లము, సహగమనము పతివ్రతా మాహాత్మ్యము, అరిషడ్వర్గము | 164–193 | 150–182 | ॥ |
| 6. | దుర్వ్యసనములు – నిరసనము, యాచకుఁడు, మఱికొన్ని ఉపదేశాలు | 194–216 | 183–201 | ॥ |
| 7. | విష్ణుభక్తి, శివభక్తి, శివపూజ, శివకథా శ్రవణ కీర్తనములు, రామనామము, సంధ్యావందనాదికము | 217–292 | 202–270 | అద్దంకి శ్రీనివాస్ |
| 8. | అష్టవిధ వివాహములు, వివాహ పద్ధతులు, వివాహమాడఁదగు కన్యలు, వివాహమాడఁదగని కన్యలు, మేనఱికము | 293–346 | 271–304 | ॥ |

| | **అంశం** | **పద్యసంఖ్య** | **పుట** | **వ్యాఖ్యాత** |
|---|---|---|---|---|
| 9. | ఔరసాది పుత్త్రభేదాదులు, వేశ్యాధర్మములు | 347–408 | 305–343 | అద్దంకి శ్రీనివాస్ |
| | కావ్యసూచిక | | 344–354 | |
| | పద్య సంఖ్యానుక్రమణిక | | 355–360 | |
| | దాసరి లక్ష్మణస్వామి పరిచయం | | 361–368 | |

# వేశ్యామాతృ ధర్మములు

**1.** కం. **తనయఁ గని గారవంబున**
**ననుదినమును సావధానయై యొడికమునం**
**బెనిచి పదంపడి యెలజ**
**వ్వన మగుటయు వేడ్కతోడ వారిజముఖికిన్**

*దశకుమారచరిత్రము, 5 – 13*

**అన్వయం:** తనయన్ – కని, గారవంబునన్, అనుదినమునున్, సావధానయై, ఒడికమునన్ – పెనిచి, పదంపడి – వారిజముఖికిన్ – ఎల – జవ్వనము + అగుటయున్; వేడ్కతోడన్.

**వ్యాఖ్య:** అపహారవర్మ తన అనుభవాలను రాజవాహనుడికి చెబుతున్నాడు. మరీచి అనే ఒక మహర్షిని అంగదేశపు వేశ్య ఎలా వంచించిందో వివరిస్తున్నాడు. తపస్సుకోసం వచ్చానని నమ్మించి మరీచికి శిష్యురాలు అయ్యింది ఒక వేశ్య. ఆమెను తీసుకుబోవడానికి వేశ్యమాత వచ్చింది. ఆ వేశ్యమాత మరీచితో తన వృత్తిధర్మాలను ఏకరువు పెడుతోంది.

మహర్షీ! మా ఇళ్ళల్లో మేము కూతురు పుట్టిందంటే సంబరపడతాం. కూతుర్ని చాలా గారాబంగా (గారవంబునన్) చూసుకుంటాం. రోజూ శ్రద్ధగా ఏకాగ్రచిత్తంతో (సావధానయై) ఎంతో అందంగా ప్రేమగా (ఒడికమునన్) పెంచి పెద్దదాన్ని చేస్తాం. ఆ పద్మముఖికి (వారిజ ముఖికిన్) బాల్యం గడిచి అటుపైని (పదంపడి) యౌవనంలో అడుగుపెడుతుంది. విలాసాలొలికించే వయస్సు (ఎల జవ్వనము) వస్తుంది. అప్పుడు ఎంతో వేడుకతో మేము ఏమి చేస్తామో తెలుసా!

★★★

**2.** కం. **ధనవంతుఁడైనవానిం**
**దన యిచ్చను దిరుగువాని దానగుణమునం**
**బనుపడువానిం గైకొని**
**యనుపంగా వలయుఁ గూఁతు నాతనికడకున్**

*దశకుమారచరిత్రము, 5 – 15*

**అన్వయం, వ్యాఖ్య :** మరీచీ! మంచి ధనవంతుడికోసం వెదుకుతాం. తల్లిదండ్రుల అదుపు ఆజ్ఞలకు లోబడకుండా స్వేచ్ఛగా తిరిగేవాడి కోసం చూస్తాం. వాడికి దానగుణం ఉన్నదా లేదా? అనేది కూడా తెలుసుకుంటాం. ధనవంతుడూ, స్వేచ్ఛా సంచారీ, దానగుణం దండిగా ఉన్నవాడూ (పసుపడువాడు) దొరకగానే (కైకొని) కూతుర్ని వాడికి తగిలిస్తాం. వాడి దగ్గరికి పంపుతాం. పంపాలి – ఇది మా కులాచారం, మా వృత్తి ధర్మం.

★★★

**3.** కం. **మగలం బలువురఁ దన్నుం**
**దగులింపఁగ నొఱపుఁ గఱపి తానొక్కనిపైఁ**
**దగులము సేసిన నొకమెయి**
**మగిడింపుచుఁ గూఁతుఁ బడుపు మరపఁగవలయున్**

*దశకుమారచరిత్రము, 5 – 16*

**అన్వయం :** పలువురన్ – మగలన్ – తన్నున్ – తగులింపఁగన్ – ఒఱపున్ – కఱపి; తాను + ఒక్కనిపైన్ – తగులము + చేసినన్ – ఒక మెయిన్ – మగిడింపుచున్; కూఁతున్ – పడుపు మరపఁగన్ – వలయున్.

**వ్యాఖ్య:** మహర్షీ! కూతుర్ని ఒకడికి తగిలించడంతో మా బాధ్యత ముగిసిపోలేదు. అలాంటి మొగుళ్ళను (మగలన్) పదిమందిని ఆకర్షించి తనను తగులుకొనేట్టు చేసుకోగలిగిన (తగులింపఁగన్) నైపుణ్యం (ఒఱపున్) కూతురికి పరిపూర్ణంగా నేర్పుతాం. నేర్పి (కఱపి) అంతటితో వదిలెయ్యం! వాళ్ళల్లో ఏ ఒక్కడి మీదనైనా మా అమ్మాయి మనసుపడి అనుబంధం పెంచుకున్నట్టయితే (తగులము చేసినన్) ఏదో ఒక రకంగా నయానా భయానా కూతురి మనస్సు మళ్ళిస్తాం (మగిడింపుచున్). మళ్ళించి పడుపువృత్తికి మప్పుతాం. పడుపువృత్తి ఇష్టపడేట్టూ మరిగేట్టూ చేస్తాం. అలా మరిగేట్టు చెయ్యడం మా కర్తవ్యం (మరపఁగవలయున్). ఇది మా వృత్తి ధర్మం. ఇంకా మా కర్తవ్యాలు కొన్ని ఉన్నాయి. చెబుతాను ఆలకించు.

★★★

**4.** సీ. **ఒరుఁ డొసంగిన యీఁగి పురుడు చూపుచు లోభి**
**చే నర్థ మొయ్యనం జేఁది కొనుచుఁ**
**బురుడు సూపిననైనఁ బుడుక నేరనివాని**
**నంగడిఁ బొచ్చెపో నాఁగికొనుచు**